సాక్షి నల్లగొండ

బుధవారం ၊ 28 ၊ మే ၊ 2025



అన్ని రంగాల్లో విఫలమైంది

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి విమర్శించారు. - 8లో



న్యూసెన్స్ కేసులో జైలు శిక్ష

న్యూసెన్స్ కేసులో ఓ వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ సూర్యాపేట కోర్టు ద్వితీయ శ్రేణి జడ్జి జీవీ రమణ తీర్పు చెప్పారు. - 8లో

గరిష్టం/కనిష్టం 36°/25°

వాతావరణం

మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు మంత్రుల రాక

చిట్యాల: పట్టణ కేంద్రంలో బుధవారం నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరుకానున్నారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ నిధులు సుమారు కోటి రూపాయలతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను వారు ప్రారంభించనున్నారు.

భవిత కేంద్రంలో పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న అనంతరెడ్డి

గుర్రంపోడు : మండల కేంద్రంలో దివ్యాంగ విద్యార్థుల భవిత కేంద్రాన్ని మంగళవారం జిల్లా ఉద్యానవన శాఖ అధికారి పి.అనంతరెడ్డి పరిశీలించారు. జిల్లాలోని అన్ని మండలాల భవిత కేంద్రాలకు ఇటీవల జిల్లాస్థాయి అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించగా గుర్రంపోడు మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని కలెక్టర్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నాంపల్లి భవిత కేంద్రం స్పెషల్ ఆఫీసర్‌గా ఉన్న అనంతరెడ్డి గుర్రంపోడు భవిత కేంద్రంలో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. భవిత కేంద్రం మరమ్మతుల్లో భాగంగా ర్యాంపు, ప్రత్యేక మరుగుదొడ్లు, పైకప్పు మరమ్మతు పనులు పూర్తి చేసి కేంద్రంలో అవసరమైన సామగ్రిని సమకూర్చనున్నట్లు తెలిపారు. ఆయన వెంట మండల విద్యాధికారి నోముల యాదగిరి, ఐఈఆర్పీ శారద ఉన్నారు.

3 నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

నల్లగొండ: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు డీఈఓ భిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఫీజు చెల్లించిన విద్యార్థులు హాల్ టికెట్లు https:bse.telangana.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

1న బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

మిర్యాలగూడ టౌన్ : రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా బాలబాలికల జట్ల ఎంపిక జూన్ 1వ తేదీన మిర్యాలగూడ పట్టణంలోని హౌజింగ్ బోర్డులోగల క్లియో స్పోర్ట్స్ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ నవీన్‌కుమార్, అంజయ్య, మధుబాబులు తెలిపారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అండర్ -11, 13, 17, 19 బాలబాలికలు, పురుషులు, మహిళల జట్లను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. జూన్ 1వ తేదీ సీనియర్స్ విభాగంలో పురుషులు, మహిళలు 35 నుంచి 80 ఏళ్ల వయస్సు గల వారిని ఎంపిక చేస్తారని తెలిపారు. అండర్ 11, 13 బాలబాలికల జట్లను 2వ తేదీన ఎంపిక చేస్తారన్నారు. ౹. వివరాలకు 9848959215, 9948052108 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఘనంగా లక్ష పుష్పార్చన

నార్కట్‌పల్లి : చెర్వుగట్టు గ్రామంలో గల శ్రీపార్వతి జడల రామలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం అర్చకులు వేద మంత్రాలతో లక్ష పుష్పార్చన నిర్వహించారు. అమావాస్య కావడంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు సాయంత్రం నుంచే ఆలయానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. వచ్చారు. భక్తులు రాత్రి కొండపైన నిద్రించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఆలయ సిబ్బంది, పోలీసులు తగు చర్యలు తీసుకున్నారు. లక్ష పుష్పార్చనలో ఈఓ నవీన్‌కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, సతీష్ శర్మ, సురేష్ శర్మ, శ్రీకాంత్ శర్మ, సీనియర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అమావాస్య సందర్భంగా శ్రీపార్వతి జడల రామలింగేశ్వర స్వామి ఆలయ ఆవరణలో కిక్కిరిసిన భక్తులు



జిల్లా వ్యవసాయాధికారితో 29న ఫోన్ ఇన్

ఈసారి వర్షాలు ముందుగానే కురుస్తున్నందున ఆరుద్ర కార్తె కంటే ముందే పంటల సాగుకు సన్నద్ధం కావచ్చా.. పత్తి తదితర మెట్టపంటలు ఎప్పుడు వేసుకుంటే బాగుంటుంది. వానాకాలం వరినార్లు పోసుకునేందుకు అనువైన సమయం ఎప్పుడు.. విత్తనాల ఎంపికలో ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి.. నకిలీ విత్తనాలను ఎలా గుర్తుపట్టాలి.. తదితర సమాచారం రైతులు తెలుసుకునేందుకు జిల్లా వ్యవసాయాధికారితో 'సాక్షి' ఫోన్ ఇన్ నిర్వహిస్తోంది. రైతన్నలు నేరుగా వ్యవసాయాధికారికి ఫోన్ చేసి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

తేదీ. 29.05.2025 (గురువారం)
సమయం : ఉదయం
10 నుంచి 11 గంటల వరకు

డయల్ చేయాల్సిన ఫోన్ నంబర్ :
89777 51294

వయోజన మహిళలకు ఉల్లాస్!

అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యక్రమం

- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పథకం అమలు
- నిరక్షరాస్యులను గుర్తించే పనిలో డీఆర్‌డీఏ సిబ్బంది
- విద్యాశాఖ, సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహణ

నల్లగొండ: గ్రామీణ ప్రాంతాల్లో చదవడం, రాయడం రాని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ఉల్లాస్ పథకాన్ని ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఈ పథకం కొనసాగనుంది. ఈ పథకాన్ని సెర్ప్, విద్యాశాఖ ఉమ్మడి భాగస్వామ్యంతో కొనసాగించనున్నారు. మొదటగా మహిళా సంఘాల్లోని సభ్యుల్లో నిరక్షరాస్యులను, మధ్యలో బడి మానేసిన పిల్లలను గుర్తించి ఓపెన్ టెన్త్‌తోపాటు వారి ఆసక్తిని బట్టి డిగ్రీ వరకు చదివించాలనేది ప్రభుత్వం ఉద్దేశం.

మహిళా సంఘాల్లో నిరక్షరాస్యుల గుర్తింపు..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో కొనసాగే ఈ



ఉల్లాస్ పథకం ద్వారా నిరక్షరాస్యులను గుర్తించే కార్యక్రమాన్ని సెర్ప్ అధికారులు ప్రారంభించారు. జిల్లాలోని 33 మండలాల పరిధిలో ఉన్న మహిళా సంఘాల్లోని సభ్యుల్లో నిరక్షరాస్యులు ఎంతమంది ఉన్నారనేది వీఓఏ(విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్) ద్వారా ఏపీఓలు గుర్తించే పనిలో ఉన్నారు. ఈ నెల చివరి నాటికి నిరక్షరాస్యులను, మధ్యలో బడి మానేసినవారిని గుర్తిస్తారు.

ఉల్లాస్ ఉద్దేశం ఇదీ..

సామాజిక సాధికారతలో భాగంగా ఉల్లాస్ కార్యక్రమం ద్వారా చదువురాని వారందరికీ చదవడం, రాయడం నేర్పించడమే ఉల్లాస్ పథకం ముఖ్య ఉద్దేశం. మహిళా సంఘాల్లోని సభ్యుల్లో కేవలం సంతకం మాత్రమే దాదాపు 50 శాతం మందికి వచ్చు అనేది ప్రాథమిక సమాచారం. మహిళా సంఘాల్లోని వారందరికీ చదవడం, రాయడం నేర్పించాలనేది ఉల్లాస్ పథకం ఉద్దేశం. మధ్యలో బడిమానేసిన వారిని గుర్తించి ఓపెన్ టెన్త్ చదివించడం, ఆ తర్వాత కూడా వారికి చదవాలనే ఆసక్తి ఉంటే ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ చేయిస్తారు. ఆ తర్వాత వారికి స్కిల్ డెవలప్‌మెంట్, టెక్నికల్ కోర్సులు నేర్పించి ఉపాధి అవకాశాలు దక్కేవిధంగా ఉల్లాస్ కార్యక్రమాన్ని అమలుచేస్తారు. మహిళలకు చదవడం రాయడం నేర్పించడం, బ్యాంకింగ్‌లో ఆర్థిక క్రమశిక్షణతోపాటు పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలను కూడా నేర్పిస్తారు.

తల్లి చదువుతో కుటుంబంలో వెలుగు..

తల్లి చదువుతో ఆ కుటుంబంలో వెలుగు నిండుతుంది. కుటుంబం అంతా అక్షరాస్యులు ఉంటే ఆ గ్రామం అభివృద్ధి పథంలో పయనించేందుకు దోహదపడుతుంది. బడికి వెళ్లే పిల్లల డ్రాపవుట్ తగ్గడంతోపాటు బాల్య వివాహాలపై అవగాహన పెరుగుతుంది. అక్షరాస్యులు కావడం వల్ల ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలపై అవగాహన పెరిగి వాటిని పొందగలుగుతారు.

వలంటీర్లుగా మహిళా సంఘాల అక్షరాస్యులు

డీఆర్‌డీఏ, సెర్ప్ ఆధ్వర్యంలో నిరక్షరాస్యులను గుర్తించే కార్యక్రమం కొనసాగుతోంది. నిరక్షరాస్తులను గుర్తించిన తర్వాత జూన్ మొదటి వారంలో వీరిని గ్రూప్‌లుగా విభజిస్తారు. 15 నుంచి 20 మందికి చొప్పున గ్రూప్‌గా చేసి ఆ గ్రామంలోని మహిళా అక్షరాస్యులైన వారితో ఈ నిరక్షరాస్యులకు చదువు చెప్పిస్తారు. చదవడం, రాయడం వచ్చేంతవరకు నేర్పించే బాధ్యత ఈ వలంటీర్లదే. వీరికి ఎలాంటి పారితోషికం ఉండదు. కేవలం సేవాభావంతో ఈ బాధ్యత నిర్వర్తిస్తారు. విద్యాశాఖ ఈ కార్యక్రమానికి పుస్తకాలు అందించడంతోపాటు పథకం విజయవంతం అయ్యేందుకు సహకరిస్తారు. గ్రామంలో ఉండే ఉపాధ్యాయులు కూడా వారికి అండగా ఉంటారు.

మహిళలకు ఇది మంచి అవకాశం



ఉల్లాస్ పథకం ద్వారా చదువురాని మహిళలకు చదవడం, రాయడం, నేర్పించడంతోపాటు మధ్యలో బడి మానేసిన వారిని ఓపెన్ టెన్త్, డిగ్రీ చదివించడం కోసం ప్రత్యేక తరగతులను కూడా మండల స్థాయిలో నిర్వహిస్తారు. దివ్యాంగులకు కూడా చదువుకునేందుకు ఇందులో అవకాశం లభిస్తుంది. వయోజన విద్యా శాఖ అధికారులకు ఇప్పటికే మహిళా సంఘాల జాబితా అందించాం. ప్రస్తుతం చదువురాని వారు ఎవరు, చదువుకున్న వారు ఎవరనేది గుర్తించే కార్యక్రమం జరుగుతోంది. మహిళా సంఘాల సభ్యులకు ఇది మంచి అవకాశం

– శేఖర్‌రెడ్డి, డీఆర్‌డీఓ

అర్హుల జాబితా రూపొందించాలి

- నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ: జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద అర్హులైన లబ్ధిదారుల జాబితాను అధికారులు రూపొందించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం జిల్లాల వారీగా పంపించిన రైతు ఆత్మహత్యల జాబితా, ముఖ్యమంత్రి ప్రజావాణి ద్వారా వచ్చిన వితంతు పెన్షన్ కుటుంబాల జాబితా ఆధారంగా జాబితాను రూపొందించాలన్నారు. ఈ పథకం కింద లబ్ధి పొందేందుకు అర్హులైన వారు సంబంధిత తహసీల్దార్‌కు దరఖాస్తు సమర్పించాలని సూచించారు. దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, కుటుంబ సభ్యుల ధ్రువపత్రం, మరణ ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ పాసుపుస్తకం జిరాక్స్, సహజ మరణమా, ప్రమాదవశాత్తు మరణమా అని తెలిపే అఫిడవిట్, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం జిరాక్స్, ఐకేపీ ద్వారా నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం అందజేయాలని తెలిపారు. తహసీల్దార్ దరఖాస్తుపై విచారణ నిర్వహించి ఆర్డీఓకు సమర్పించాలన్నారు. ఆర్డీఓ జిల్లా రెవెన్యూ అధికారికి, డీఆర్ఓ ద్వారా డైరెక్టర్ ఎస్ఎస్, సెర్ప్ సీఈఓకు ఆన్‌లైన్ ద్వారా పంపిస్తామన్నారు. అదనపు కలెక్టర్ లబ్ధిదారులను గుర్తింపును పర్యవేక్షిస్తారని కలెక్టర్ తెలిపారు.

కొనసాగుతున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

నల్లగొండ: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం ఇంటర్ ఫస్టియర్ కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలు జరిగాయి. మొదటి సంవత్సరం పరీక్షకు 4603 మంది విద్యార్థులకు గాను 4241 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ఇంటర్ సెకండియర్ కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షకు 1364 మంది హాజరు కావాల్సి ఉండగా 1244 మంది విద్యార్థులు హాజరయ్యారు.

విత్తే సమయమొచ్చే..



మర్రిగూడ : ప్రస్తుతం కురుస్తున్న జల్లులకు మర్రిగూడ మండలంలోని రైతులు పత్తి విత్తనాలు విత్తుతున్నారు. మిగతా రైతులు దుక్కులు దున్నే పనిలో నిమగ్నమయ్యారు.

మొక్కలను మింగేశారు..!

- అవెన్యూ ప్లాంటేషన్ పేరిట నిధులు స్వాహా
- పనులు చేయకుండానే బిల్లులు డ్రా
- సోషల్ మీడియాలో మిర్యాలగూడ మున్సిపల్ మాజీ చైర్మన్ పోస్టు వైరల్

మిర్యాలగూడ: మున్సిపాలిటీలకు పాలకవర్గం లేకపోవడంతో అధికారులు ఆడిందే ఆట, పాడిందే పాటగా సాగుతోంది. మున్సిపాలిటీ అభివృద్ధికి వచ్చిన నిధులను పనులను చేయకుండానే అధికారులు స్వాహా చేస్తున్నారు. ప్రజాధనం భారీగా దుర్వినియోగం అవుతున్నా మున్సిపల్ ఉన్నతాధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మిర్యాలగూడ పట్టణంలో నార్కట్‌పల్లి–అద్దంకి రహదారి వెంట అవెన్యూ ప్లాంటేషన్ పేరిట లక్షల రూపాయలు కాజేసినట్లు సమాచారం. ఈ మేరకు మున్సిపల్ మాజీ చైర్మన్ తిరునగరు భార్గవ్ సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ వైరల్‌గా మారింది. ఈ అవినీతి అంతా ఓ ప్రజాప్రతినిధి కనుసన్నల్లో ఇద్దరు అధికారులు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

రూ.70లక్షల నిధులు మంజూరు..

మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలో నార్కట్‌పల్లి –అద్దంకి రహదారిపై 2023లో అవెన్యూ ప్లాంటేషన్ కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో గ్రీన్ బడ్జెట్ కింద మిర్యాలగూడ మున్సిపాలిటీకి నందిపాడు బైపాస్ (2.33 కి.మీ) నుంచి ఖలీల్ దాబా (4.66 కి.మీ) వరకు ఇన్నర్, ఔటర్‌లో అవెన్యూ ప్లాంటేషన్ ఏర్పాటు చేసేందుకు రూ.70,14,616.60 నిధులు మంజూరయ్యాయి. ఈ పనులను చేసేందుకు 5 సెప్టెంబర్ 2023న టెండర్లను ఆహ్వానించారు. సెప్టెంబర్ 14న టెండర్ల గడువు ముగియడంతో అదేరోజు సాయంత్రం టెండర్లను ఓపెన్ చేశారు. ఈ పనులు 90 రోజుల్లో పూర్తి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ మొక్కలను నాటలేదు. దీంతో అప్పటి అధికారులు బిల్లులు చేయలేదు. అదే సంవత్సరం అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ప్రభుత్వం మారింది. అప్పుడున్న మున్సిపల్ కమిషనర్, ఇంజనీర్, ఏఈ బదిలీ అయ్యారు.

హడావుడిగా చెక్కు జారీ

మిర్యాలగూడ పట్టణంలోని నందిపాడు బైపాస్ నుంచి ఖలీల్ దాబా వరకు రోడ్డుకు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్ కింద మొక్కలను నాటాల్సి ఉంది. అప్పటికే బైపాస్ వెంట కోనోకార్పస్, గన్నేరు మొక్కలు నాటి ఉన్నాయి. ఎక్కువ క్వాలిటీ ఉన్న మొక్కలను నాటాలని రూ.70 లక్షల నిధులు మంజూరు చేయగా మొక్కలను నాటకుండానే మున్సిపల్ అధికారులు ఇటీవల బిల్లులు నమోదు చేసి చెక్కు జారీ చేశారు. హడావుడిగా కమిషనర్, మున్సిపల్ ఇంజనీర్, ఏఈలు బిల్లులు చేయడంపై అనుమానాలు కలుగుతున్నాయి. మొక్కలను నాటకుండానే నాటినట్లు అవెన్యూ ప్లాంటేషన్ పేరిట లక్షల రూపాయల నిధులు స్వాహా చేశారు.



మొక్కలు నాటినట్లు రికార్డుల్లో నమోదు చేసిన ప్రదేశం

మున్సిపాలిటీలో అవినీతిపై జోరుగా చర్చ

అవెన్యూ ప్లాంటేషన్‌లో జరిగిన అవినీతిపై మున్సిపల్ మాజీ చైర్మన్ మంగళవారం మన మిర్యాలగూడ ఫేస్‌బుక్ పేజీలో మిర్యాలగూడ మున్సిపాలిటీలో అధికారుల ఇష్టారాజ్యమా? అని పెట్టిన పోస్టు వైరల్ అవుతోంది. బైపాస్‌రోడ్డు వెంట అవెన్యూ ప్లాంటేషన్ పేరిట లక్షల రూపాయల నిధులు స్వాహా చేశారని, దానికి సంబంధించిన టెండర్, నోటిఫికేషన్ పోస్టు చేయడంతో పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. మొక్కలను నాటకుండానే నాటినట్లు మున్సిపల్ అధికారులు బిల్లులు రాసి రికార్డు చేసి చెక్కు జారీ చేశారని, దీనిపై స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్ సమగ్ర విచారణ చేయాలని కోరడంతో మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతిపై జోరుగా చర్చ సాగుతోంది. కాగా ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ యూసుఫ్‌ను, డీఈ వెంకన్నను ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

రేణుకా ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



రేణుకా ఎల్లమ్మ అమ్మవారు

కనగల్ : దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారిని అర్చకులు వివిధ రకాల పుష్పాలతో అలంకరించి అభిషేకంతోపాటు విశేష పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు బోనాలతో వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

జూన్ 3 నుంచి రెవెన్యూ సదస్సులు

నల్లగొండ : ధాన్యం సేకరణ, వ్యవసాయ సీజన్ సంసిద్ధత, భూ భారతి, ఇందిరమ్మ ఇళ్లపై సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి జిల్లా కలెక్టర్లతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జూన్ 3 నుంచి 20వ తేదీ వరకు అన్ని రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు మరోసారి రాష్ట్రవ్యాప్తంగా భూ భారతిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజాపాలన మాదిరిగానే ప్రతి మండలానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో మిగిలిపోయిన 10 శాతం ధాన్యం సేకరించాలని సూచించారు. ఎంత ఎరువులు, విత్తనాలు కావాలో ముందస్తు ప్రణాళిక రూపొందించాలన్నారు. ఎవరైనా ఎరువులు, విత్తనాలను బ్లాక్ మార్కెటింగ్ చేస్తే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలు అమ్మేవారి జాబితా తయారుచేసి వారిపై పీడీ యాక్టు నమోదు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పక్కగా అమలు చేయాలని, మండల స్థాయిలో ధరల నియంత్రణ కమిటీ వేయాలని సూచించారు. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ అదన కలెక్టర్ జె.శ్రీనివాస్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ హరీష్, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రవణ్, ఇన్‌చార్జ్ డీఆర్ఓ వై.అశోక్ రెడ్డి, జిల్లా సహకార అధికారి పత్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల్లో వంద రోజుల యాక్షన్ ప్లాన్

- జూన్ 2 నుంచి ప్రారంభం
- అభివృద్ధి పనుల పూర్తి, రుణాలు ఇప్పించడం, కొత్త పొదుపు సంఘాల ఏర్పాటు లక్ష్యం
- ప్రణాళిక రూపొందిస్తున్న అధికారులు

నల్లగొండ టూటౌన్: మున్సిపాలిటీల్లో 100 రోజుల యాక్షన్ ప్లాన్ రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ 2వ తేదీ నుంచి 100 రోజుల యాక్షన్ ప్లాన్ ప్రారంభించాలని మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు అన్ని మున్సిపాలిటీలకు ఆదేశాలు జారీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొత్తగా చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిసింది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలోని నల్లగొండ, మిర్యాలగూడ, హాలియా, నందికొండ, దేవరకొండ, చండూరు, చిట్యాల, నకిరేకల్ మున్సిపాలిటీల్లో 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేయనున్నారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో అన్ని విభాగాలు 100 రోజుల యాక్షన్ ప్లాన్‌కు అనుగుణంగా చర్యలు చేపట్టాలని ఉత్తర్వుల్లో ప్రభుత్వం ఆదేశించింది.



మెప్మా సిబ్బంది, మహిళా సంఘాల ఆధ్వర్యంలో..

మెప్మా సిబ్బంది, పొదుపు సంఘాల మహిళలు, వివిధ శాఖల అధికారులతో కలిసి జూన్ 2వ తేదీన పెద్ద ఎత్తున 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేసే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. మొక్కలు నాటేందుకు స్థలాలు గుర్తించడం, నర్సరీల్లో ఉన్న మొక్కల వివరాలు, ఎక్కడ పంపిణీ చేయాలి, ఎక్కడ నాటాలి అనే వివరాలు తెలియజేయాల్సి ఉంటుంది.

అక్రమ నల్లా కనెక్షన్ల గుర్తింపు..

ఇంజనీరింగ్ విభాగం అధికారులు టెండర్ల ప్రక్రియ చేపట్టి పనులు పూర్తి చేయడంతోపాటు వార్డుల్లో అక్రమ నల్లా కనెక్షన్లను గుర్తించడం, క్రమబద్ధీకరించడం, లేదా తొలగించడం లాంటివి చేపట్టాల్సి ఉంటుంది. మున్సిపల్ అధికారులు ఆస్పత్రుల యాజమాన్యాల సహకారంతో కార్మికులకు వైద్యశిబిరాలు చేపట్టాలి. పార్కుల్లో అభివృద్ధి పనులకు టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభించాల్సి ఉంటుంది. పారిశుద్ధ్యం మెరుగుపర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. 100 రోజుల్లో ఏ విభాగం ఎంతమేర పనితీరు మెరుగుపర్చారో నివేదిక అందజేయాల్సి ఉంటుంది. వార్డులకు నోడల్ ఆఫీసర్ల నియామకం చేపట్టి నిరంతరం పర్యవేక్షించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయా వార్డుల్లో చేపట్టాల్సిన పనుల వివరాలను ఆయా మున్సిపాలిటీలు తేదీల వారీగా జాబితా రూపొందించే పనిల్లో పడ్డాయి.

నివేదిక సిద్ధం చేస్తున్నాం



ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జూన్ 2వ తేదీ నుంచి 100 రోజుల యాక్షన్ ప్లాన్ ప్రారంభిస్తాం. మున్సిపాలిటీల్లోని అన్ని విభాగాల ఉద్యోగులు 100 రోజుల్లో చేయాల్సిన పనులు గుర్తించి వాటిని పూర్తి చేస్తారు. 100 రోజుల యాక్షన్ ప్లాన్‌కు సంబంధించి అన్ని వివరాలతో నివేదిక సిద్ధం చేస్తున్నాం.

–సయ్యద్ ముసాబ్ అహ్మద్, నీలగిరి మున్సిపల్ కమిషనర్

అదేవిధంగా టెండర్ల ప్రక్రియ పూర్తి చేయడం, చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేయడం లాంటివి చేపట్టాల్సి ఉంటుంది. వార్డుల్లో వార్డు ఆఫీసర్లు ఇంటింటికీ తిరిగి ఆస్తి పన్ను తప్పుఒప్పులను సవరించడం లాంటి కార్యక్రమం 100 రోజుల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది.

కొత్తగా ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు..

ఈ నెలాఖరులోగా 100 రోజుల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకుని జూన్ 2వ తేదీ నుంచి ప్రారంభించేందుకు మున్సిపాలిటీ అధికారులు సన్నద్ధం అవుతున్నారు. అదేవిధంగా మెప్మా ఆధ్వర్యంలో వీధి వ్యాపారులను గుర్తించడం, వారికి రుణాలు ఇప్పించడం, కొత్త పొదుపు సంఘాలను ఏర్పాటు చేయడంలాంటివి చేపట్టాలి. వీటితోపాటు కొత్తగా ఏర్పాటు చేసిన సంఘాలకు రుణాలు ఇప్పించడం, కొత్తగా ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ల ఏర్పాటు, దివ్యాంగులకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడంలాంటి కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.

క్లుప్తంగా

జూదరుల అరెస్ట్

పాలకవీడు : పాలకవీడు మండలం రాఘవపురం గ్రామంలో మంగళవారం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఆరుగురు జూదరులను అరెస్ట్ చేశారు. రాఘవపురం గ్రామంలో ఓ ఇంట్లో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం అందడంతో ఆ ఇంటిపై దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ లక్ష్మీనర్సయ్య తెలిపారు. వారి వద్ద రూ.21,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఇంటి యజమానితోపాటు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

పాలకవీడు: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తికి గేదె అడ్డురావడంతో అదుపుతప్పి రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన పాలకవీడు మండలం బెట్టెగూడెం సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జాన్‌పహాడ్ గ్రామంలో విద్యుత్ లైన్‌మెన్ కింద షేక్ సైదా అనే వ్యక్తి ఆర్టిజన్‌గా పనిచేస్తున్నాడు. వసూలైన కరెంట్ బిల్లులు జమ చేసేందుకు మంగళవారం సైదా ద్విచక్ర వాహనంపై పాలకవీడు మండల కేంద్రంలోని విద్యుత్ సెక్షన్ కార్యాలయానికి వచ్చి వెళ్తుండగా.. బెట్టెగూడెం వద్ద రోడ్డుపైకి ఒక్కసారిగా గేదె అడ్డురావడంతో అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో అతడి తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు వెంటనే సైదాను 108 వాహనంలో ఆస్పత్రికి తరలిచారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.

బైక్ ఢీకొని..

డిండి: డిండి మండల కేంద్రంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. డిండి మండల కేంద్రానికి చెందిన కటికర్ల ఆకాష్ బైక్‌పై స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్లే హైవే వెంట తపాలా కార్యాలయం వైపు కాలినడకన వస్తున్న డిండి పట్టణానికి చెందిన కటికర్ల ఎంకమ్మను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆకాష్‌తోపాటు ఎంకమ్మకు గాయాలయాయ్యి. చికిత్స నిమిత్తం వారిని కుటుంబ సభ్యులు నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



రాధ (ఫైల్)

గుర్రంపోడు: భర్త అప్పులు చేయడంతో మనస్తాపానికి గురై ఎలుకల మందు తాగిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందింది. ఎస్‌ఐ పి. మధు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రంపోడు మండలం జిన్నాయిచింత గ్రామానికి చెందిన కట్టబోయిన రాధ(30) భర్త వెంకటేష్ మద్యానికి బానిసై ఏ పనీ చేయకుండా అప్పులు చేశాడు. దీంతో మనస్తాపానికి గురైన రాధ ఈ నెల 25వ తేదీ అర్ధరాత్రి ఇంట్లో ఎలుకల మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందింది. మృతురాలి తల్లి గొర్ల నాగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

న్యూసెన్స్ కేసులో జైలు శిక్ష

సూర్యాపేటటౌన్: న్యూసెన్స్ కేసులో ఓ వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ సూర్యాపేట కోర్టు ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి బీవీ రమణ మంగళవారం తీర్పు వెలువరించారు. సూర్యాపేట వన్‌టౌన్ ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని హైటెక్ బస్టాండ్‌లో సోమవారం అర్ధరాత్రి చైను సుభాష్ అనే వ్యక్తి మద్యం తాగి బస్సు డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగాడు. అక్కడ ఉన్న వారితో గొడవపడుతూ, దుర్భాషలాడుతూ ఉండగా.. సమాచారం అందుకున్న వన్ టౌన్ ఎస్‌ఐ తన సిబ్బందితో హైటెక్ బస్టాండ్ వద్దకు వెళ్లి చైను సుభాష్‌ను అదుపులో తీసుకొని మంగళవారం కోర్టులో హాజరుపర్చారు. సుభాష్‌కు సూర్యాపేట ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి బీవీ రమణ రెండు రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైంది

● మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న జగదీష్‌రెడ్డి

సూర్యాపేటటౌన్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఆరోపించారు. ఫార్ములా-ఈ కేసులో కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు, సిరిసిల్ల క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ నాయకుల దాడిని ఖండిస్తూ మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో జగదీష్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. అవినీతి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అద్భుత ప్రగతి సాధిస్తుందని, అన్ని శాఖల్లో కమిషన్లే వాళ్ల ఎజెండా అని విమర్శించారు. 'ఏ మంత్రి ఎంత సంపాదించాలె.. సీఎం సీటుకు ఎట్లా పోటీపడాలె..' అన్న సోయి తప్ప మరొకటి లేదని విమర్శించారు. అభివృద్ధిని పక్కన పెట్టి దోచుకునే విషయంలో కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు పోటీపడుతున్నారని, ప్రశ్నిస్తున్న వాళ్లకు నోటీసులు ఇప్పించి భయపెట్టాలని చూస్తున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చిల్లర చేష్టలతో రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నాడన్నారు. కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులిస్తే భయపడతామనుకుంటున్నారని, ప్రపంచ వ్యాప్తంగా కేటీఆర్ క్రేజ్ పెరుగుతుందనే ఏడుపు రేవంత్‌కు ఉందన్నారు. విదేశాల్లో తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు కేటీఆర్ హాజరుకాకుండా అడ్డుకోవాలనే ఏసీబీతో నోటీసులు ఇచ్చారని ఆరోపించారు. కేసీఆర్ కాళేశ్వరం ఎందుకు కట్టిండో కాంగ్రెస్‌కు అవగాహన లేదని, మన నీళ్లను చంద్రబాబు తీసుకెళ్తుంటే సోయిలేదని విమర్శించారు. ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిపై దృష్టి సారిస్తే మంచిదన్నారు. సిరిసిల్లలో కేటీఆర్ క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ నాయకుల దాడి చిల్లర చేష్టన్నారు. కాంగ్రెస్ పనికిమాలిన చర్యలతో మరింత అభాసుపాలు అవుతుందని విమర్శించారు.

యాదగిరిగుట్టలో ట్రైనీ ఇంటలిజెన్స్ బృందం



లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న ట్రైనీ ఇంటలిజెన్స్ బృందం

యాదగిరిగుట్ట రూరల్: రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ ఇంటలిజెన్స్ ట్రైనింగ్ అకాడమీ(ఐఐటీఏ)లో శిక్షణ పొందుతున్న 57 మంది ట్రైనీ ఇంటలిజెన్స్ బృందం సభ్యులు మంగళవారం యాదగిరిగుట్ట ఆలయాన్ని సందర్శించారు. స్వయంభూవులను దర్శించుకున్నారు. అనంతరం ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఆలయానికి విచ్చేసే వీవీఐపీలు, వారి రూట్ మ్యాప్, బందోబస్తు గురించి ఎస్‌పీఎఫ్ ఆర్‌ఐ శేషగిరిరావు ట్రైనీ ఇంటలిజెన్స్ బృందం సభ్యులకు వివరించారు.

తీర్థయాత్రలకు ప్రత్యేక రైళ్లు



రామగిరి(నల్లగొండ), భువనగిరి: తీర్థయాత్రలకు వెళ్లే వారి కోసం రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఐఆర్‌సీటీసీ టూరిజం జాయింట్ మేనేజర్ కిషోర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూన్ 14 నుంచి జులై 13 వరకు రెండు ప్యాకేజీలుగా హైదరాబాద్ నుంచి ప్రత్యేక రైళ్లను ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. మొదటి ప్యాకేజీలో గంగా రామాయణ పుణ్యక్షేత్ర యాత్ర ఉంటుందని, ఈ యాత్రలో భాగంగా జూన్ 14 నుంచి 22 వరకు వారణాసి, అయోధ్య, ప్రయాగ్‌రాజ్‌ను దర్శించుకోవచ్చన్నారు. దీనికి సాధారణ టికెట్ రూ. 16,200, థర్డ్ ఏసీ రూ.26,500, సెకండ్ ఏసీ రూ.35,000 ధర నిర్ణయించనట్లు తెలిపారు. రెండో ప్యాకేజీలో ఐదు జ్యోతిర్లింగాల యాత్ర ఉంటుందని, ఇందులో భాగంగా జులై 5 నుంచి 13వ తేదీ వరకు మహంకాలేశ్వర్, ఓంకారేశ్వర్, త్రయంబకేశ్వర్, భీంశంకర్, ఘృష్టేశ్వర్, ఎల్లోరా, మోవ్, నాగ్‌పూర్ ప్రాంతాలు సందర్శించవచ్చన్నారు. దీనికి సాధారణ టికెట్ రూ.14,700, థర్డ్ ఏసీ రూ.22,900, సెకండ్ ఏసీ రూ.29,900 ఉంటుందన్నారు. రైలుతో పాటు బస్సు, హోటల్, భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9701360701, 9281030712 నంబర్లను లేదా www.irctctourism.com వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

దూరదర్శన్ ఆటా-పాట కార్యక్రమానికి ఎంపిక



ఆదిమళ్ల మౌనిక

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ పట్టణానికి చెందిన ఆదిమళ్ల మౌనిక దూరదర్శన్ యాదగిరి చానల్‌లో బుధవారం నుంచి ప్రారంభమయ్యే ఆటా-పాట కార్యక్రమానికి ఎంపికైంది. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో జానపద రంగంపై పోస్టు గ్రాడ్యుయేషన్ చదువుతున్న మౌనిక టీవీల్లో వచ్చే వివిధ కార్యక్రమాల్లో పాల్గొని జానపద గీతాలు ఆలపిస్తూ తన ప్రతిభను చాటుకుంటోంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భవిష్యత్‌లో మంచి సింగర్‌గా రాణించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నానని పేర్కొంది. దూరదర్శన్ ఆటా-పాట కార్యక్రమానికి ఎంపికవ్వడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ మేరకు తెలంగాణ ఉద్యమ కళాకారులు, మిర్యాలగూడ కళా వేదిక సభ్యులు మౌనికను అభినందించారు.

మోకాలి చిప్ప మార్పిడి ఆపరేషన్ విజయవంతం



ఆపరేషన్ అనంతరం వైద్యులతో ఎర్రయ్య

నల్లగొండ టౌన్ : నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో ఓ రోగికి ఐదుగురు వైద్యులు విజయవంతంగా మోకాలి చిప్ప మార్పిడి చేశారు. నల్లగొండ మండలం చర్లపల్లికి చెందిన వజ్జ ఎర్రయ్య(65) మోకాలి నొప్పితో బాధపడుతూ నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చాడు. ఎర్రయ్యను పరీక్షించిన ఆర్థోపెడిక్ డాక్టర్లు మోకాలు చిప్ప మార్పిడి శస్త్రచికిత్స చేయాలని సూచించారు. ఎర్రయ్య అంగీకరించడంతో ఈ నెల 22న ప్రభుత్వ ఆస్పత్రి ఆర్థోపెడిక్ విభాగం అధిపతి డాక్టర్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో డాక్టర్లు నాగరాజు, కృష్ణానాయక్, సైదులు, మల్లికార్జున్, రాహుల్ కలిసి ఎర్రయ్యకు మోకాలి చిప్ప మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. చికిత్స అనంతరం ఎర్రయ్య మాట్లాడుతూ.. తనకు మోకాలి నొప్పి తగ్గిందని వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. మొదటిసారి మోకాలి చిప్ప మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించడంతో ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణకుమారి వైద్యులను అభినందించారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం



హోమం నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

చింతపల్లి: చింతపల్లి మండల కేంద్రంలోని షిర్డీ సాయిబాబా ఆలయ 18వ వార్షికోత్సవాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేద పండితుల ఆధ్వర్యంలో మంగళ వాయిద్య సంఘోషణ, గణపతి ప్రార్థన, గోపూజ, భూత బలి యాగశాల ప్రవేశం, విగ్నేశ్వర పుణ్యాహవచనం, పంచ గవ్వ ఆరాధన ప్రాశవం, విగ్రహ మార్జనలు, రుత్విక్ వరుణ దీక్షా కంకణ ధారణ, అఖండ దీపారాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టు సభ్యులు తడకమళ్ల శ్రీనివాస్, కుంభం పుల్లారెడ్డి దంపతులు పాల్గొని కార్యక్రమాలు నిర్వహించారు.

షేక్ ఐరా వైద్య ఖర్చులకు దాతల సాయం

సాక్షి ఎఫెక్ట్..

భూదాన్‌పోచంపల్లి: 'చిట్టి తల్లికి పెద్ద కష్టం' శీర్షికన మంగళవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి దాతలు స్పందించారు. భూదాన్‌పోచంపల్లి మండలం వంకమామిడి గ్రామానికి చెందిన 14నెలల షేక్ ఐరా క్యాన్సర్‌తో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. మెరుగైన వైద్యం చేయించలేక ఆమె తల్లిదండ్రుల పడుతున్న ఇబ్బందులపై సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన దాతలు మొత్తం రూ.47,273 ఆర్థికసాయాన్ని మంగళవారం ఐరా తల్లిదండ్రులకు అందజేశారు. ఇందులో పోచంపల్లికి చెందిన ఎస్ఎస్ వాట్సాప్ గ్రూప్ ద్వారా రూ.12,930, వంకమామిడి గ్రామానికి చెందిన బొడిగె శివకుమార్ స్నేహితులు రూ.13,500, ఐరా తండ్రి జమాల్ ఫోన్ పేకు దాతలు రూ. 20,843 పంపించారు. ఈ సందర్భంగా జమాల్ కుటుంబ సభ్యులు సాక్షి దినపత్రికకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎస్‌బీఐ డీజీఎం ఆకస్మిక తనిఖీ



శాలిగౌరారంలో ఎస్‌బీఐలో సిబ్బందితో మాట్లాడుతున్న డీజీఎం వినోద్‌కుమార్ సిన్హా

శాలిగౌరారం: మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌ను బ్యాంకు డిప్యూటీ జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ సిన్హా మంగళవారం ఆకస్మికంగా తనఖీ చేశారు. ఈ సందర్భంగా బ్యాంకుతో పాటు ఏటీఎంను పరిశీలించారు. అదేవిధంగా ఖాతాదారులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. బ్యాంకు పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో సిబ్బందిని ప్రశ్నించారు. బ్యాంకు వినియోగదారులకు మెరుగైన, వేగవంతమైన సేవలను అందించాలని సూచించారు. అనంతరం సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి బ్యాంకు సేవలు, సిబ్బంది పనితీరుపై పలు సూచనలు చేశారు. వినియోగదారులకు ఇబ్బందులు కలిగేలా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట క్రెడిట్ చీఫ్ మేనేజర్ రాజీవ్‌ఖన్నా, బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

ముందు జాగ్రత్తలే పిడుగుల నుంచి రక్షణ

మునగాల: నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించడంతో వర్షాలు విస్తరంగా కురిసే అవకాశం ఉంది. వర్షాకాలంలో పిడుగులు పడుతుండడంతో ప్రజలతో పాటు మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. అంతేకాకుండా కొన్నిసార్లు ఆస్తి నష్టం కూడా సంభవిస్తుంటుంది. పిడుగులు పడే సమయంలో ప్రజలు భయంతో పరుగులు పెడతారు. చెట్ల కిందకు వెళ్తుంటారు. పిడుగులు పడిన సమయంలో ముందు జాగ్రత్తలు పాటిస్తే వాటి బారిన పడకుండా ఉండవచ్చు. పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు, పశువుల కాపరులు భయంతో చెట్ల చాటుకు పరుగులు తీస్తారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో గత కొన్నేళ్లుగా పిడుగులు ఏ ప్రాంతంలో, ఏ సమయంలో పడతాయో ముందుగానే పసిగట్టి తెలియజేస్తున్నారు. సెల్‌ఫోన్‌లకు అలర్ట్ మెసేజ్‌లు రావడంతో ముందుగానే నష్ట నివారణ చర్యలు తీసుకోవచ్చు

పాటించాల్సిన జాగ్రత్తలు..

- వర్షం పడుతున్న సమయంలో ఎట్టి పరిస్థితుల్లో ఎత్తుగా ఉన్న చెట్లు, సెల్‌టవర్లు, స్తంభాలు, కొండల వద్దకు వెళ్లకూడదు.
- ట్రాన్స్‌ఫార్మర్లుకు దూరంగా ఉండాలి. కంప్యూటర్లు, ల్యాప్‌ట్యాప్‌లు, స్మార్ట్‌ఫోన్లు, విద్యుత్ స్టవ్‌లు ఉపయోగించకూడదు.
- ఉరుములతో వర్షం వస్తున్నప్పుడు నీటితో కూడిన పనులు చేయకూడదు.
- గుంపులుగా ఉండకూడదు. ముఖ్యంగా పొలాల్లో పనిచేయడం, పశువులను మేపడం, చేపలు పట్టడం వంటివి చేయకూడదని నిపుణులు చెబుతున్నారు.

ఇటీవల జరిగిన కొన్ని ఘటనలు..

- నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి వద్ద ఏప్రిల్ 21న రహదారిపై ఆగి ఉన్న పత్తిలోడు లారీపై పిడుగుపడడంతో పత్తితో పాటు లారీ దగ్ధమైంది.
- కోదాడ మండలం నల్లబండగూడెం వద్ద మే 21న పిడుగు పడడంతో చెట్టు కింద ఉన్న 36మేకలు మృత్యువాత పడ్డాయి
- మేళ్లచెరువు మండలం కందిబండ వద్ద మే 26న పిడుగు పడడంతో ఏడు మేకలు మృతిచెందాయి.

ఆర్థిక ఇబ్బందులతో బలవన్మరణం



వెంకటేశం (ఫైల్)

రాజాపేట: ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురైన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రాజాపేట మండల కేంద్రంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజాపేట మండల కేంద్రానికి చెందిన ఎక్కలదేవి పుండరీకంకు ఇద్దరు కుమారులు సంతానం. చిన్న కుమారుడు వెంకటేశం (45) పవర్‌లూం పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వెంకటేశంకు వివాహం కాగా.. అతడి భార్య కొన్నేళ్ల క్రితమే అతడిని విడిచిపెట్టి వెళ్లిపోయింది. అప్పటి నుంచి వెంకటేశం ఒంటరిగానే నివసిస్తున్నాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వెంకటేశం మనస్తాపానికి గురై ఆదివారం తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం వెంకటేశం ఉంటున్న ఇంట్లో నుంచి దుర్గంధం వస్తుండడంతో కాలనీవాసులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు స్థానిక ఎస్‌ఐ అనిల్ తన సిబ్బందితో కలిసి వెంకటేశం ఇంటి వచ్చి చూసేసరికి అతడు విగతజీవిగా కనిపించాడు. వెంకటేశం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుట్టుగా తవ్వేస్తున్నారు



మట్టి తరలిస్తున్న దృశ్యం

అడవిదేవులపల్లి: అధికారులు పట్టించుకోకపోవడంతో కొందరు అక్రమార్కులు ఏకంగా గుట్టనే తవ్వి, అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. అడవిదేవులపల్లి మండలం ఉల్సాయిపాలెం గ్రామ సమీపంలో గల సర్వే నంబర్ 145లోని గుట్ట ప్రాంతంలో సుమారు 5ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. గత కొద్దిరోజులుగా దామరచర్ల మండలానికి చెందిన ఓ వ్యక్తి గుట్టుగా జేసీబీతో మట్టిని తవ్వి టిప్పర్ల సహాయంతో అక్రమంగా తరలిస్తున్నాడు. ఈ తంతు బాహాటంగానే జరుగుతున్నప్పటికీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల కనుసన్నల్లోనే ఈ మట్టి తరలిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో కూడా గుట్టను తవ్వారని స్థానికులు అంటున్నారు. అధికారులు స్పందించి అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

కట్టంగూర్: రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్న మహిళను బొలేరో వాహనం ఢీకొట్టడంతో మృతిచెందింది. ఈ ఘటన విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై కట్టంగూర్ మండలం ముత్యాలమ్మగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని మాణిక్యాలమ్మగూడెం సమీపంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముత్యాలమ్మగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని సవ్వళ్లగూడెం గ్రామానికి చెందిన వనం లక్ష్మి(53) తన పెద్ద కుమారుడికి అనారోగ్యం ఉండడంతో మంగళవారం విజయవాడ-హైదరాబాద్ హైవేపై మాణిక్యాలమ్మగూడెం సమీపంలో టిఫిన్ సెంటర్‌లో టిఫిన్ తీసుకుని రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తుండగా.. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న బొలేరో వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మి తలకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి 108 వాహనంలో నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందింది. మృతురాలి చిన్న కుమారుడు తిరుమలేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎం.రవీందర్ తెలిపారు.

డీసీఎం ఢీకొని..

శాలిగౌరారం: మండలంలోని వంగమర్తి సమీపంలో 365వ నంబర్ హైవేపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. ఎస్‌ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం మామిడాల గ్రామానికి చెందిన కుర్ర శంకర్(30) కారులో అర్వపల్లి నుంచి 365వ నంబర్ హైవే మీదుగా నకిరేకల్‌కు వెళ్తుండగా.. శాలిగౌరారం మండలం వంగమర్తి శివారులోకి రాగానే వెనుక నుంచి డీసీఎం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శంకర్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని నకిరేకల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

లారీ కింద పడి బిహార్ కూలీ మృతి

శాలిగౌరారం: ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో లారీ కింద పడి వలస కూలీ మృతిచెందాడు. ఈ ఘటన శాలిగౌరారం మండలం చిత్తలూరు గ్రామంలో మంగళవారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రం సహ్రస జిల్లా బలూహా గ్రామం బైజ్‌నాథ్‌పట్టికి చెందిన సూరజ్‌కుమార్(20) అదే ప్రాంతానికి చెందిన మరో 11మందితో కలిసి చిత్తలూరులోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో హమాలీ పనిచేసేందుకు వచ్చారు. ఐకేపీ కేంద్రంలోనే గుడారం వేసుకొని నివసిస్తూ హమాలీ పనిచేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం ధాన్యం తూకం వేసిన హమాలీలు సాయంత్రం ఆ ధాన్యాన్ని లారీలో లోడ్ చేస్తున్నారు. ఈ క్రమంలో సాయంత్రం 6.30 గంటల సమయంలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం రావడంతో లారీలోని ధాన్యం బస్తాలపై టార్పాలిన్‌ను కప్పిన హమాలీలు నలుగురు.. వర్షానికి తడువకుండా లారీ కిందకు వెళ్లారు. ఇది గమనించని లారీ డ్రైవర్ వర్షం వస్తుందని లారీని రోడ్డు ఎక్కించేందుకు స్టార్ట్ చేసుకొని ముందుకు కదిలించాడు. వెంటనే గమనించిన లారీ కింద ఉన్న నలుగురు హమాలీలలో ముగ్గురు బయటకు రాగా.. సూరజ్‌కుమార్ కూడా తప్పించుకునే క్రమంలో లారీ సూరజ్‌కుమార్ పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సూరజ్‌కుమార్ మృతదేహాన్ని ఆటోలో నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రైస్‌మిల్లులో రేకులు మీద పడి..

భూదాన్‌పోచంపల్లి: రైస్‌మిల్లులో పనిచేస్తున్న వలస కూలీపై ప్రమాదవశాత్తు ఇనుప రేకులు పడడంతో మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం సాయంత్రం భూదాన్‌పోచంపల్లి మండలం పిలాయిపల్లిలోని ఇంద్రకీలాద్రి ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్‌మిల్లులో జరగగా.. మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ కె. భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన కుమోద్‌కుమార్(19) పిలాయిపల్లిలోని ఇంద్రకీలాద్రి ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్‌మిల్లులో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం రైస్‌మిల్లులో తవుడు వచ్చే గొట్టం జామ్ కాగా దానిని తొలగించేందుకు కుమోద్‌కుమార్ ఇనుప రాడ్డుతో గట్టిగా కొట్టడంతో గొట్టంతో పాటు పైన ఉన్న ఇనుప రేకులు ఒక్కసారిగా అతడిపై పడ్డాయి. ఈ ప్రమాదంలో కుమోద్‌కుమార్ తల, గదమ, చేయికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే రైస్‌మిల్లు యాజమాన్యం అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు పరీక్షించి అప్పటికే అతడు మృతిచెందినట్లు నిర్ధారించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి బంధువు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



యాదయ్య (ఫైల్)

కొండమల్లేపల్లి: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కొండమల్లేపల్లి మండల కేంద్రంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. నేరెడుగొమ్ము మండలం పేర్వాల గ్రామానికి చెందిన ఎరుకల యాదయ్య(48), కృష్ణమ్మ దంపతులు వ్యవసాయంతో పాటు కల్లు గీసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కుమారుడు మణిగౌడ్, కుమార్తె ఉన్నారు. కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన యాదయ్య సోమవారం రాత్రి కొండమల్లేపల్లిలోని ఫర్టిలైజర్ దుకాణంలో పురుగుల మందు కొనుగోలు చేసి దేవరకొండ రోడ్డులో మటిల్డా స్కూల్ వెనుక వెంచర్‌లో దానిని తాగాడు. మంగళవారం తెల్లవారు జామున బహిర్భూమికి వెళ్లిన వారు యాదయ్య విగతజీవిగా పడి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ అజ్మీరా రమేష్ మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య కృష్ణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

● ఆధార్.. బేజార్

భువనగిరిటౌన్ : రేషన్ సరుకులు అందాలన్నా, ఆసరా పింఛన్ పొందాలన్నా, విద్యార్థులు ఉపకార వేతనాలు మంజూరు కావాలన్నా, బ్యాంకులో ఖాతా తీయాలన్నా.. పాఠశాలలో ప్రవేశం పొందాలన్నా ఆధార్‌కార్డు తప్పనిసరి. దీంతో ఆధార్ అప్‌డేట్, కొత్త కార్డుల కోసం జనం మీసేవ కేంద్రాలకు బారులుదీరుతున్నారు. విద్యాసంస్థలు తెరుచుకోనుండటంతో తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలల్లో చేర్పించాల్సి ఉంది. అలాగే రేషన్‌కార్డు కోసం మీసేవల్లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించడంతో సెంటర్లు కిటకిటలాడుతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి ఉదయం 8గంటలకే ఆధార్ కేంద్రాలకు చేరుకుంటున్నారు. జిల్లా కేంద్రంలో కేవలం మూడు కేంద్రాలే ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నూతన కార్డుకు దరఖాస్తు, మార్పులు చేర్పులకు ఒక్కొక్కరికి కనీసం 15 నిమిషాలు పడుతుంది. రోజూ వందల సంఖ్యలో జనం వస్తుండగా 30 మందికి మించడం లేదు.



భువనగిరిలోని మీసేవ కేంద్రంలో రద్దీ



మీసేవ కేంద్రం బయట నిరీక్షిస్తున్న జనం